# దిబ్బ ప్రభువుగారితో ఇంటర్వ్యూ

సాయంకాలము అయిదు గంటలకు ప్రభువుగారి దర్శనం అవుతుందని కోట నుంచి నాక్కబురొచ్చింది. నా మామూలు దుస్తులతోనే ప్రభువు వారిని దర్శించటానికి అనుమతి వచ్చింది గాని, శ్రీవారికి అధమం మూడు శ్రీలైనా తగిలించక తప్పదని ఉత్తరువయింది. కవుల దగ్గర్నుంచీ రెండేసి శ్రీలు తగిలించుకున్నారు గనుకనున్నున్నూ, కథల్లో బోడెమ్మలకు సహితం రెండేసి శ్రీలు ఉంపింపించబడుతున్నాయి గనుక నున్నున్నూ నేను శ్రీవారిని శ్రీశ్రీశ్రీ వారనక తప్పదని కోటవారు నాకు తెలియబరిచారు.

శ్రీవారు, తోటలో నన్ను ఇంటర్వ్యూ చేస్తారని తెలిసింది. నాకు తోటకన్న శ్రీవారే ముందర ఔపించారు. ఇంతకూ నాకు తోట అవుపించనేలేదు. ఒక పక్కగా వెడలుపైన ఆకులు గల మొక్క ఒకటి కనిపించింది. అక్కడక్కడ ఎండిపోయిన మొక్కలు పొదలు పొదలుగా కనిపించాయి.

"ఇదేనా శ్రీశ్రీశ్రీ వారి తోట" - అన్నాను.

"ఇంకా ఉన్నాయి, కాని అన్నిటిలోకీ ముఖ్యమైనదిదే" అన్నారు శ్రీవారు, దక్షిణం గానూ, తూర్పుగానూ ఉన్న చెట్ల సముదాయాలు చూపుతూ. ఆ తోటలు పెద్ద పెద్ద చెట్లతో కూడి ఉన్నాయి. చూడటానికి తోటలంటే నమ్మశక్యంగాకున్నాయి. శ్రీవారు నా సందేహం తీర్చారు.

"ఈ తోట మా ముత్తాతగారు దుక్క ప్రభువుగారు వేసినటువంటిది. ఇవన్నీ అప్పుడు వారి చేత్తో వేయింపించిన మల్లెతోటలు.... ఆహా! మల్లెల సౌరభం ఆ కాలంలో చూడవలసింది! జగ్గకవిగారు ఈ తోటలో మల్లెల్నే వర్ణించి, సురలోకంలో ఉండుకున్నటువంటి పారిజాతాలు వీటితో పోలవని స్పష్టంగా చెప్పారు. మహాకవి!"

"శ్రీశ్రీశ్రీ వారి అభిప్రాయంలో మల్లెలకు రాను రానూ వాసన తగ్గుతోందనా?" అని అడిగాను ఆశ్చర్యంతో.

"అందుకు సందేహం ఏమీలేదు. అన్ని పూలకీ వాసన తగ్గుతోంది, మనుషులంతా నీరసించిపోతున్నట్టే. మీలాగా పాశ్చాత్య సంస్కారం గల వారీ సత్యాలని నమ్మరు."

"శాస్త్రీయమైన ఆధారం ఉంటే..."

"లేకేం, ఉంది. మల్లెపూలే తీసుకోండి. ప్రపంచంలో అన్నిటికీ ఏదో పరిమితి ఉంటుందని ఒప్పుకుంటారా?"

"ఒప్పుకుంటాను."

"అయితే మల్లెపూల సౌరభం పరిమితంగా ఉంటుందని మీరే ఒప్పుకుంటున్నారు. ఆ సౌరభం కొద్దిపూల నాశ్రయించినప్పుడున్న సాంద్రత అసంఖ్యాకమైనటువంటి పుష్పజాలానికి సంక్రమించేసరికి..."

"ప్రభువు వారి అభిప్రాయం అర్థమయింది. మనుషుల సంఖ్యకూడా హెచ్చిన కొద్దీ వ్యక్తులు నిర్వీర్యులవుతారని తమ అభిప్రాయం కాదా?"

"అవును. ఇరవయ్యో శతాబ్ద మధ్యంలో వొట్టి పుట్టగొడుగుల్లాటి మనుషులు పుడతారనీ, వాళ్ళు యుద్ధాలు చేసేటప్పుడు శత్రుసేనల మధ్య యోజనాల కొద్దీ దూరం ఉంటుందే తప్ప బాహాబాహి కచాకచి యుద్ధం చెయ్యరనీ నేను ఘట్టిగా చెప్పగలను."

"యుద్ధమంటే స్ఫురించింది. అడగదగిన ప్రశ్న అవునో కాదో తెలీదు – తమకూ సన్నం రాజుగారికీ యుద్ధం తప్పదని పుకారుగా ఉంది. ఇది ఎంతవరకు నిజమో సెలవివ్వటానికి శ్రీశ్రీశ్రీ వారికేమైనా అభ్యంతరం..."

"ఏమీలేదు. ఒక్కటే ముక్క చెబుతున్నాను. నేను శాంతి కోరేవాణ్ణి. నాకు యుద్ధాలంటే అసహ్యం. నా ప్రజల క్షేమమే నాకు కావలసింది. సన్నం రాజుగారు కయ్యానికి కాలు దువ్వుతాడు. నేనాయన ఎత్తులకు లొంగనని ఆయనకు తెలీదు. ఈ మధ్య తమ దూతను పంపి సన్నం రాజుగారు 'నాకు ముప్ఫైవేల కత్తులు అవసరంగా కావాలి. రెండు వేల గుర్రాలు కావాలి. ఇవి వెంటనే తమ కార్ఖానాల నుంచీ, అశ్వశాలల నుంచీ ఇప్పిస్తారా, యుద్ధానికి వస్తారా?' అని కబురు చేశారు. కావలిస్తే అంతకు రెట్టింపు కత్తులిస్తానన్నాను. గుర్రాలు కూడా ఇచ్చేస్తానన్నాను, కానీ యుద్ధానికి ఒప్పుకోలేదు. చూశారా నా యుక్తి?"

నా గుండె ఎగిరి గొంతులో కూచుంది.

"ఇదంతా ఉచితంగానే–"

"లేదు; సన్నం రాజుగారి దగ్గిర చక్కని బాణా సంచా తయారు చేసే వాళ్ళున్నారు. కత్తుల విలువకీ, గుర్రాల విలువకీ సరిపడా బాణాసంచా పంపమన్నాను."

"అడుక్కుతిన్నట్టే ఉంది నీ తెలివి" అని లోపల అనుకుని, పైకి, "దారి తప్పి యుద్ధం జరిగితే ఆత్మరక్షణ సన్నాహాలేం చేస్తారు?"

"ఏముందీ చెయ్యటానికీ? నా మాట శిరసావహించే నా బిడ్డల్లాంటి ప్రజ ఉన్నారు. వాళ్ళు చచ్చయినా పోతారు గాని ఓటమికి ఒప్పుకోరు."

"క్షమించండి. మీ ఏలుబడిలో సస్యసమృద్ధి చాలా తక్కువగా ఉన్నట్టు కనిపించింది. అనేక చోట్ల నీటివసతులు లేక పంటలెండిపోతున్నాయి. చెరువుల్లో పూడు తీస్తున్నట్టు కనిపించదు. ఆహార సమృద్ధిలేని ప్రజలు యుద్ధం చెయ్యగలరా?"

"పిచ్చివాడా, శరీర బలంతో పోరేవాడేం పోరగలడు? దైవబలం ఉండాలి. చెరువుల విషయమూ, పొలాల విషయమూ నేనంగీకరిస్తాను. కానీ ఏం చెయ్యనూ? నేనాట్టే ఖర్చుదారును కాను, నాకు సరిపడా రాబడి ఉంది. ఉన్న పొలాలన్నీ బాగుచేయించి పండించి ఆ పంటంతా ఏం చేసుకుంటాం?"

"తమ యేలుబడిలో అందరికీ తిండి సమృద్ధిగా ఉందా? తిండికి మాడే ప్రజలున్నట్టు కనిపిస్తారే?"

"పనిచెయ్యని వారికి తిండిలేదేమోగాని పనిచేసే వారందరికీ కడుపునిండా తిండి ఉంది."

"పనిలేని వాళ్లకి సాగుబడి చెయ్యని పొలాలివ్వరాదా? చెరువులు బాగు చేయించరాదా?"

"నాకీ రాబడి చాలునని చెప్పానుగా! నేను కొందరు రాజుల్లాగా ఖర్చు దారును కాను. నా రాబడి ఇంకా తగ్గిపోయినా నేను సుఖంగా బతకగలను. అందుచేత కొన్ని పొలాలు బీడు పెట్టేయిద్దామనుకుంటున్నాను."

"మరింత మంది తిండికి మాడి చావరా?"

"నా పొలాలు నేను బీడు పెట్టటానికి ఒకరి ఆజ్ఞ కావాలా?" అన్నారు ప్రభువువారు కళ్ళెర్రజేసి.

"క్షమించాలి, ప్రభువులు. నేను చెప్పేదేమంటే ప్రజలు తమ నిర్ణయాన్ని అంత వినయంగా ఆమోదిస్తారా అని."

"వాళ్ళు దైవభక్తిపరులు. భగవంతుడిస్తే దొరుకుతుందనీ, లేకపోతే లేదనీ వాళ్ళెరుగుదురు."

"వాళ్ళకి విద్యా సౌకర్యాలేవిధంగా ఉంటాయి తమ ఏలుబడిలో?"

"విద్యలో నాకు విశ్వాసంలేదు. శరీరం వొంచి కష్టించే ప్రజలు చదువు మరిగితే పనిచెయ్యరు. కవిత్వాలు చెప్పి కానుకలు గుంజుతారు. నాకు కవిత్వమంటే మంట. వచనం అర్థమయినంత సులువుగా మనకు ఎప్పుడన్నా పద్యం అర్థమవుతుందా? అదీగాక చదువుకోవాలంటే ఇప్పటికీ ఎన్నో మహాగ్రంథాలున్నాయి. ఒక్క భారతం చాలదా జన్మల్లా చదవటానికి. నేను పదిహేనేళ్ళనుంచీ చదువుతున్నాను, అరణ్యపర్వం అవకుండా ఉంది. భారతం తెరిచేసరికి నాకు బ్రహ్మానందమై సుషుప్తి కలుగుతుంది. మహాకావ్యం! మహాకావ్యం!"

“తమ యేలుబడిలో పరిశ్రమ లెట్లా ఉన్నాయి?”

“ఉన్నాయి. ఫరవాలేదు, వడ్రంగులూ, కమ్మరవాళ్ళూ, సాలెవాళ్ళూ ఉన్నారు. ఇంకేం కావాలి?”

“సన్నం రాజుగారి పరిపాలనలో పరిశ్రమలు బాగా సాగుతున్నాయని విన్నాను?”

“అనకండి; సన్నం రాజును నా మీదకి ఉసికొల్పే వాళ్ళు పారిశ్రామికులే. వాళ్ళకి మా రాజ్యంలో ఉండే ఇనపమట్టి కావాలి. నా రాజ్యంలో తయారయ్యే కత్తులన్నీ ఇమ్మన్నా ఇస్తాను కానీ ఆ ఇనపమట్టి సన్నం రాజుకి దక్కనిస్తానా? మా తాత గారు చెబుతుండే వారు: ఆ మట్టిలో కోటానుకోట్ల కత్తులున్నాయని. అమ్మో? నేనేం వెర్రి కుట్టెనా?”

విన్న సంగతులతో నాకు మొహం మొత్తింది. నేను సెలవు పుచ్చుకోవటానికి ఉపక్రమిస్తూండగా నా కన్ను ఆ తోటలోవున్న ఒక్క మొక్కమీద పడింది. అదే తోటలోకల్లా మహోన్నతంగా వుంది.

“ఇదే వృక్షమో తెలుసుకోవచ్చునా?” అన్నాను.

శ్రీవారు నవ్వి “విత్తు దొరికినప్పుడు నాకు అదే సందేహం కలిగి నాటి చూశాను. చెట్టు పెరిగాక అది ఆముదపు చెట్టని శాస్త్రవేత్తలు చెప్పారు” అన్నారు.

“తమరు ఈ తోటలో మరికొన్ని చెట్లుకూడా వేయింపించలేక పోయారా?” అన్నాను.

“వేయించాను, కాని అవి దీన్ని మించి పెరిగాయి. అంచేత కొట్టింపింపించ వలిసొచ్చింది” అన్నారు శ్రీవారు ఆముదపు చెట్టుకేసి సగర్వంగా చూస్తూ.

***ముద్రణ: ఆంధ్రశిల్పి మాసపత్రిక, మార్చి 1947***